క్లుప్తంగా

ముక్కంటి సేవలో ఏపీటీడీసీ చైర్మన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం ఆంధ్ర రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ-కేవైసీ చేయించుకోండి



ఈ-కేవైసీ చేయించుకుంటున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం లబ్ధి కోసం రైతులందరూ తప్పనిసరిగా సమీప ఆర్‌ఎస్‌కేలలో ఈ- కేవైసీ చేయించుకోవాలని ఏఓ షణ్ముగం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌ఎస్‌కేలో ఆయన రైతులకు ఈ-కేవైసీ చేయించారు. ఏఈఓలు రేవతి, లావణ్య పాల్గొన్నారు.

అక్షయ క్షేత్రంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కోలా ఆనంద్, కోలా విశాలాక్షి

రేణిగుంట: తేజోభారత్ వ్యవస్థాపకురాలు, కోలా ఆనంద్ సతీమణి కోలా విశాలాక్షి పుట్టినరోజు సందర్భంగా రేణిగుంటలోని అక్షయ క్షేత్రంలో గురువారం మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. రాజారాయల్, నరేష్ రాయల్, బీడీ బాలాజీ, ప్రేమ్ రెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఉంటున్న రాజేంద్ర సతీమణి జయలక్ష్మి గురువారం మృతి చెందారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారులు లోకనాథ్, గోపీనాథ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీవారి సురేష్, శరవణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆర్పీలు

శ్రీకాళహస్తి: మున్సిపాలిటీలోని మెప్మా శాఖలో 1 నుంచి 13వ వార్డు వరకు బాధ్యత వహిస్తున్న సీఓ తమకొద్దని ఆ వార్డుల పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలు పురపాలక కార్యాలయంలో ఆందోళన చేశారు. 13 వార్డులకు సంబంధించి 19 మంది సంఘటిత ఆర్పీలు ఉండగా వారందరూ తమ వార్డుల్లో మహిళలకు రుణాలు తీసి ఇవ్వలేకపోతున్నామని, రుణాల మంజూరులో జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశా రు. సంఘటిత ఆర్పీలు గురువారం ఈ విషయమై ఆ సీఓపై మెప్మా టీఎంసీకి ఫిర్యాదు చేశారు

యూరియా పంపిణీ



యూరియా తీసుకెళ్తున్న రైతులు

వరదయ్యపాళెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు మండలంలో సాగు చేసిన వరి పంటకు యూరియా కొరత ఏర్పడింది. దీనిపై వేధిస్తున్న యూరియా కొరత అన్న కథనం ఈ నెల 15న సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారులు మండలంలో యూరియా కొరతపై ఆరా తీశారు. మండల ఏఓ నుండి నివేదిక తెప్పించుకుని, ఆ నివేదిక ఆధారంగా వరదయ్యపాళెం మండలానికి యూరియాను సరఫరా చేశారు. గత రెండు రోజులుగా మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏఓ గౌరి తెలిపారు.

డయేరియాపై అవగాహన



పాఠశాలలో నీటి తొట్టెను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

రేణిగుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఎల మండ్యం పంచాయతీలోని మర్రిగుంట అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటీ భవనాలలో డయేరియా, సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్రరావు, ఏఎన్‌ఎం జయంతి పాల్గొన్నారు.

రైతుకు లాభాల ప్యాక్‌హౌస్

- పండ్లు, కూరగాయల నిల్వ, గ్రేడింగ్, ప్యాకింగ్ సౌకర్యం
- తద్వారా ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధరలు
- ఉద్యానశాఖ ద్వారా నిర్మాణాలకు 50 శాతం రాయితీ



వరదయ్యపాళెం మండలం పెద్ద పాండూరులో నిర్మించిన ప్యాక్‌హౌస్

వరదయ్యపాళెం: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులు నాణ్యతగా ఉంటేనే మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతాయి. రైతులు తమ ఉత్పత్తులను శుభ్రం చేయకుండా నేరుగా తరలించడంతో నాణ్యత లేక ఆశించిన ధరలు లభించడం లేదు. మరోవైపు మార్కెట్‌లో డిమాండ్ లేని సమయంలో తమ ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేసుకోలేక పోతున్నారు. ఇలా పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మెళకువలు పాటించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఉద్యానశాఖ ద్వారా ప్యాక్‌హౌస్ నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. ప్యాక్ హౌస్ నిర్మాణాలకు ముందుకొచ్చిన రైతులకు 50 శాతం రాయితీని అందిస్తోందని సత్యవేడు ఉద్యానశాఖ అధికారి రాధారాణి తెలిపారు. ప్యాక్‌హౌస్ నిర్మాణాలతో రైతులకు కలిగే బహుళ ప్రయోజనాలు, వాటిని ఎలా నిర్మించుకోవాలి, సబ్సిడీ ఎలా పొందాలనే అంశాలను వివరించారు.

ఇవీ ప్రయోజనాలు

రైతులు తాము పండించిన పూలు, పండ్లు, కూరగాయలను సరైన ధర లభించేలా తాత్కాలికంగా నిల్వ ఉంచుకోవచ్చు. పంట ఉత్పత్తులను నేరుగా మార్కెటింగ్‌కు తరలించకుండా వాటిని శుభ్రం చేసుకోవడంతోపాటు ప్యాకింగ్, గ్రేడింగ్ చేసుకుని తీసుకెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. పంట ఉత్పత్తుల నాణ్యత బాగుండి మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయి.

50 శాతం రాయితీ

ప్రభుత్వం సూచించిన మేరకు ప్యాక్‌హౌస్ నిర్మాణానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతుంది. అందులో 50 శాతం రాయితీ అంటే రూ.2 లక్షలను ఉద్యానశాఖ రైతులకు అందజేస్తుంది. ప్యాక్‌హౌస్ నిర్మించుకోవాలని ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఇంజినీర్ ద్వారా ప్లాన్, అంచనా, భూమి పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రూ.వంద బాండ్ పేపర్‌పై నోటరీ అఫిడవిట్ అందజేయాల్సి ఉంటుంది.

రైతులకు అధిక లాభాలు



ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన పండ్లు, కూరగాయలకే అధిక ధరలు లభిస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు నేరుగా తీసుకెళ్లి నష్టపోతున్నారు. ప్యాక్‌హౌస్ నిర్మించుకుంటే సరుకు నాణ్యంగా మారుతుంది. రైతులు తాము పండించిన పంటలనే కాకుండా ఇతర రైతుల పంటలను ప్యాక్‌హౌస్‌లో ప్యాక్ చేయడం ద్వారా ఆదనపు ఆదాయం పొందవచ్చు. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలో గత ఏడాది రెండు ప్యాక్‌హౌస్ యూనిట్లు మంజూరయ్యాయి. కేవీబీపురం మండలంలో ఒకటి, వరదయ్యపాళెం మండలంలో మరొకటి మంజూరయ్యాయి. ఈ ఏడాది కూడా మంజూరు కానున్నాయి.

– రాధారాణి, ఉద్యానశాఖ అధికారి, సత్యవేడు

నిర్మాణం ఇలా..

30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం ఉండాలి. పైకప్పును జీఐ ఐరన్, సిమెంట్ రేకులు లేదా కాంక్రీట్‌తో చేపట్టాలి. సిమెంట్ ఫ్లోరింగ్, 8 కిటికీలు, 2 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ఉండాలి. భవనానికి సాధారణ ద్వారం, మరో 8 అడుగుల షట్టర్ నిర్మించాలి. ప్యాక్‌హౌస్ లోపల కూరగాయలు, పండ్లను శుభ్రపరిచేందుకు మూడు నీటి తొట్టెలు, ఆరబెట్టేందుకు మూడు ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గ్రేడింగ్ టేబుళ్లు, తూకానికి 300 కిలోల ఈ-వేయింగ్ మెషిన్, ప్యాకింగ్ కోసం 250 నంబర్ ప్లాస్టిక్ క్రేట్స్ ఉండాలి. ఒక ఇన్వర్టర్, కార్యాలయం టేబుల్, నాలుగు కుర్చీలు, టార్పాలిన్ షీట్లు ఉండాలి. మామిడి రైతులు అయితే తప్పనిసరిగా డేశాపింగ్ యూనిట్‌ను అమర్చుకోవాలి.

భూసేకరణపై తుది విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్మయి

సత్యవేడు: మండలంలోని కొల్లడం, చిన్న ఈటిపాకం పంచాయతీలలో రెవెన్యూ అధికారులు భూసేకరణకు సంబంధించి తుది విచారణ జరిపారు. గురువారం సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో సత్యవేడు తహసీల్దార్ రాజశేఖర్, ఓజిలి తహసీల్దార్ పద్మావతి కలసి అవార్డు విచారణలో పాల్గొన్నారు. చిన్న ఈటిపాకంలో 7.88 ఎకరాల భూమికి సంబంధించి 28 మంది రైతులు వారి హక్కు పత్రాలను, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు రెవెన్యూ అధికారులకు అందజేసి, టైటిల్ డీడ్ ధ్రువీకరించుకొన్నారు. కొల్లడంలో 3.80 ఎకరాలకు సంబంధించి ముగ్గురు రైతులు హక్కు పత్రాలు సమర్పించి భూహక్కును నిర్ధారించుకొన్నారు. డీటీ చంద్రబాబు, ఆర్డీఓ ఏఓ రవి కుమార్, ఆర్డీటీ త్యాగరాజు, ఆర్ ఐ సురేష్, వీఆర్వో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

నారాయణవనం: రెవెన్యూ అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జయరాములు తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే అవగాహన సదస్సులో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని జయరాములు కోరారు.

గృహోపకరణాల అందజేత



నూతన వధువరులకు గృహోపకరణాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన మైనారిటీ నూతన వధూవరులను ఆశీర్వదించి గృహోపకరణాలు బీరువా, మంచం, పరుపును శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు పఠాన్ ఫరీద్ నూతన వధూవరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు గోర, గౌస్ బాషా, ఫజల్, అస్లా, నియోజవర్గం వైఎస్సార్‌సీపీ యువజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీవారి సురేష్, సాధనమున్న రాయల్, ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, పులి రామచంద్రయ్య, పెరుమాళ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మామిడి కొలుగోలుకు చర్యలు



మామిడి రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నారాయణవనం: మామిడి రైతుల నుండి కాయలను స్థానిక పల్ప్ ఫ్యాక్టరీతో కొనుగోలు చేయించడానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ జయరాములు పేర్కొన్నారు. మండలంలోని టాసా పల్ప్ ఫ్యాక్టరీను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. యాజమాన్యంతో, మామిడి రైతులతో మాట్లాడారు. మీడియాతో జయరాములు మాట్లాడుతూ మామిడి రైతుల నుండి పంట కొనుగోలుకు యాజమాన్యం ప్రాధాన్యత ఇవ్వాలని, కలెక్టర్ సూచనల మేరకు ప్రస్తుతం కేజీ కాయలకు చెల్లిస్తున్న రూ.6కి అదనంగా మరో రూపాయి పెంచాలని సూచించామని అన్నారు. జారీ చేసిన టోకెన్‌లో సూచించిన సమయానికే మామిడి పంటను ఫ్యాక్టరీకి తీసుకురావాలని రైతులకు సూచించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందితో పర్యవేక్షణ చేస్తున్నట్లు జయరాములు తెలిపారు.

నివాళి



పాపానాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన మేకళత్తూరు అన్నామలై మొదలి ఉత్తర క్రియల కార్యక్రమానికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరై, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, సర్పంచ్ మేకళత్తూరు లలితా కరుణాకరన్, మాజీ సర్పంచ్ తంగా సుబ్రమణ్యం మొదలి, గోవింద స్వామి, మేకళత్తూరు చంద్ర(ఎస్ఎస్ చంద్ర), ఎంపీటీసీ సభ్యులు మునిరాజ, నాగరాజరెడ్డి, సుధీర్, ఎంసీ బాబు, ఉమా మొదలియార్, చిన్న ధర్మారెడ్డి, తంబకుమార్, ఏలుమలై, కొంగర దామోదర్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వంగా సికిల్‌సెల్ వ్యాధి

సత్యవేడు: సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా వచ్చే రక్త రుగ్మత అని దాసుకుప్పం ఈహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని దాసుకుప్పంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాధిలో ఎర్ర కర్త క ణాలు కొడవలి, చంద్రవంక ఆకారంలో ఉంటాయన్నారు. కొడవలి ఆకారపు కణాలు రక్త నాళా ల ద్వారా సులభంగా ప్రవహించలేవన్నారు. సికిల్ సెల్ వ్యాధిలో ఎర్ర రక్త కణాలు సాధారణమైన హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేస్తాయన్నారు. కొడవలి రక్త కణాలు చనిపోవడం రక్తహీనతకు దారి తీస్తుందన్నారు. మెదడుకు రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటే స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ మురళి, స్టాఫ్‌నర్సు వనజాక్షి, గాయత్రి, కవిత పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో నూకతోటి



కొత్తమారి కుప్పం గంగమ్మ సేవలో నూకతోటి రాజేష్

సత్యవేడు: మండల పరిధిలోని కొత్తమారికుప్పం పంచాయతీలో బుధ, గురువారాలు నిర్వహించిన గంగ జాతరకు వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొని గంగమ్మను దర్శించుకొన్నారు. జాతరకు విచ్చేసిన నూకతోటి రాజేష్‌ను సర్పంచ్, ఎంపీటీసీలు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యానికి, మత సామరస్యాన్ని చాటుతూ పల్లెల్లో జాతర నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనంగా పేర్కొన్నారు. తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, భానుప్రకాష్‌రెడ్డి, మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు రమేష్, శ్రీనివాసులురెడ్డి, గోవిందస్వామి, రూబెన్, జి.శేఖర్, నాగమ్మ, ఎంపీటీసీ సభ్యులు మోహన్‌రెడ్డి, విడి శరవణన్, ఎం.సుధాకర్, గురుప్రసాద్, ఎంపీ రవి, గోవిందస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లుల చెల్లింపులో పక్షపాతం



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

కేవీబీపురం: ఉపాధి పనుల బిల్లుల చెల్లింపుల్లో కూడా అధికారులు, స్థానిక ఫీల్డ్‌అసిస్టెంట్‌లు తమపై పక్షపాతం చూపుతున్నారని దిగువపుత్తూరు గ్రామానికి చెందిన దళితులు ఆరోపిస్తూ గ్రామంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కొక్కరికి వారానికి రూ.1200 నుంచి రూ.1800 వరకూ వచ్చేదని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి తమకు వారానికి రూ.250 నుండి రూ.400 కూడా దాటడం లేదని బాధిత కూలీలు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమ శ్రమకు తగ్గ వేతనాలను ఇప్పించాలని కోరారు. దీనిపై కేవీబీపురం ఏపీఓ భాస్కరయ్యను వివరణ కోరగా తక్షణమే విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొందరికే తల్లికి వందనం

బుచ్చినాయుడుకండ్రిగ: కొందరికే తల్లివందనం నగదు జమ అవుతుండడంతో తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని గ్రామ సచివాలయం వద్ద తల్లి వందనం నగదు రాకపోవడంతో ఇంటర్ పూర్తయిన సుబ్రమణ్యం, సాయి నిరసన తెలిపారు. మండలంలో 3,834 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులు కాగా 490 మందికి కోత విధించారు. వారందరికీ నగదు జమ కాలేదు. మండలంలోని గ్రామ సచివాలయాలకు విద్యార్థులు చేరుకుని తమకు తల్లికి వందనం డబ్బు పడలేదని, జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. మరి కొందరు తల్లులు ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉంటే ఒక్కరికి మాత్రమే డబ్బు పడిందని తెలిపారు. రూ.10 వే ల కంటే ఎక్కువ ఆదాయం ఉందని, కరెంటు బిల్లులు ఎక్కువ వస్తున్నాయని, భూమి ఆన్‌లైన్‌లో 10 ఎకరాల మెట్ట కంటే ఎక్కువగా చూ పుతోందని తదితర సాకులతో అర్హుల జాబితాలో తమపేర్లు లేకుండా చేశారని తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పల్లం పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు



పల్లం పాఠశాలలో ఉపాధ్యాయులతో శ్రీలంక ప్రతినిధులు

ఏర్పేడు: భారతదేశంలోని విద్యావ్యవస్థపై అధ్యయనం చేసేందుకు శ్రీలంక దేశానికి చెందిన 45 మంది విద్యావేత్తల బృందం సభ్యులు గురువారం ఏర్పేడు మండలం పల్లం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, అమలవుతున్న బోధనా పద్ధతులు, బోధనాభ్యసన సామగ్రి, సహ పాఠ్య కార్యక్రమాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం గురించి వారికి హైస్కూల్ హెచ్‌ఎం తీగల ఆనంద్ వివరించారు. అలాగే పాఠశాలలో ప్రభుత్వ నిధులతోపాటు దాతల సహాయంతో కల్పించిన మౌలిక వసతులను గురించి ఆయన వివరించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులను విద్యావిషయక జ్ఞానంపై పరీక్షించి, వారి ప్రతిభను మెచ్చుకున్నారు. శ్రీలంక ప్రతినిధులు మహేందర్, ఫెరారీ మాట్లాడుతూ భారతదేశంలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉందని, ప్రభుత్వ సహకారం బాగుందని, పాఠశాల అభివృద్ధి కోసం హెచ్‌ఎం తీగల ఆనంద్ దాతల నుంచి సేకరించిన విరాళాలతో పాఠశాల అభివృద్ధికి వెచ్చించడం స్ఫూర్తిదాయకమని ఆయన్ని అభినందించారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులందరూ శ్రీలంకకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలను చేసి విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం శ్రీలంక ప్రతినిధులను హెచ్‌ఎం ఆనంద్ ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్, వాణి, విజయ శేఖర్, వెంకటరామయ్య పాల్గొన్నారు.